

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతన్నకు శాపం

బోయినపల్లి, మే 6: మండలంలోని మల్లాపూర్, అనంతపల్లి పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకోడిగా జరుగుతుండడంతో ధాన్యపురాశులు, బస్తాల రూపంలో ఎక్కడికక్కడ కల్లాల్లో ఉండిపోవడంతో ఫలితంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యాం పూర్తిగా తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు మరోసారి ఆరబెడుతుండగా క్షణక్షణం మారుతున్న వాతావరణం పరిస్థితులపై రైతులకు కంటిమీద కునుకులేకుండా పోతుంది. వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, బీఆర్ఎస్ నాయకులు రాజయ్య, బాలమల్లేశం, చందు, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**అకాల వర్షం.. తడిసిన ధాన్యం**

వేములవాడ, మే 6 : పట్టణ పరిధిలోని బాలానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. అప్రమత్తమైన రైతులు అప్పటికే టార్పాలిన్ కవర్లను కప్పినప్పటికీ చివరి అంచుల నుంచి వచ్చిన వర్షపు నీరుతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నామని మరోవైపు ఎండ దెబ్బ కూడా తగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.



తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

## అశోక చక్ర అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్, మే 6 : స్వాతంత్ర్య దినోత్సవం 2025 నాడు సాహసోపేతంగా ప్రజలను కాపాడిన పోలీసులకు కేంద్ర హోం శాఖ అందించే అశోక చక్ర అవార్డు కోసం ఆసక్తి అర్హత గల పోలీసులు దరఖాస్తుల సమర్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణలో సాహసోపేతంగా వ్యవహరించిన పోలీసు అధికారులకు కేంద్ర హోంశాఖ అవార్డులు అందిస్తుందన్నారు. ప్రజల ప్రాణాల రక్షణలో తన ప్రాణాలు పణంగాపెట్టి అమరులైన వారికి అశోక చక్ర, ప్రస్ఫుటమైన శౌర్యం ప్రదర్శించిన వారికి కీర్తి చక్ర, శౌర్యం ప్రదర్శించిన సిబ్బందికి శౌర్య చక్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సిరిసిల్ల ఎస్పీకి తమ దరఖాస్తులు నిర్ణీత నమూనాలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులు ధైర్య సాహసాల వివరాలు పూర్తిగా తెలియజేయాలని, జూలై 2024 నుంచి జనవరి 2025 మధ్యలో జరిగిన సంఘటన అయి ఉండాలన్నారు.

## వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

బోయినపల్లి, మే 6: తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో రాణించాలని మండల విద్యాధికారి ఎం శ్రవణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్అండ్ క్రాఫ్ట్, వివిధ గేమ్స్ శిబిరాన్ని ఎంఈవో పాటు పాఠశాల హెచ్ఎం బొలగం శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత యువతను అన్ని రంగాల్లో మేలుకొల్పేందుకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇలాంటి అవకాశాలను గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మల్లేశం, ఆంగ్ల ఉపాధ్యాయులు కట్ట వెంకట హనుమాన్, వ్యాయమ ఉపాధ్యాయుడు పంతం ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగుల యూనియన్‌కు నూతన కార్యవర్గం

వేములవాడ టౌన్ , మే 6 : రాజన్న ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడిగా కూరగాయల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చంద్రగిరి శరత్, వీవీ రాంకిషన్‌రావు, వాసాలమర్రి గోపి, పెంట శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా పురాణం వంశీమోహన్, కోశాధికారిగా గట్టు గౌగమ్, సహాయకార్యదర్శులుగా పూజిత, సుశీల్, సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొడుసు మహేశ్, ప్రచార కార్యదర్శిగా సగ్గు దిలీప్, గౌరవ సలహాదారులుగా బ్రహ్మన్నగారి శ్రీనివాస్, వెల్ది సంతోష్, కే వెంకటయ్య, కార్యవర్గసభ్యులుగా వెంకటలక్ష్మి, గోపన్నగారి శివప్రసాద్, గూడూరి సందీప్, ఎస్ కుమార్, నరాల రాజు, నారవేణి రాజు, ఆరెల్లి రాకేశ్, మమత, కిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## పాఠశాల స్పెషల్ వర్కర్‌కు గౌరవ వేతనం అందజేత

సిరిసిల్ల రూరల్, మే 6: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పని చేస్తున్న స్పెషల్ వర్కర్‌కు మంగళవారం గౌరవ వేతనం అందజేసినట్లు హెచ్ఎం అనురాధ తెలిపారు.కలెక్టర్ విడుదల చేసిన స్పెషల్ వర్కర్ గౌరవ వేతనం రూ.45వేలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ బండి లక్ష్మీ చేతుల మీదుగా అందజేశామని పేర్కొన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భోజన శాల, మొక్కల సంరక్షణకు చేసిన స్పెషల్ వర్కర్ సేవలను హెచ్ఎం అనురాధ కొనియాడారు.

## రాళ్ల పేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

సిరిసిల్ల రూరల్, మే 6: తంగళ్లపల్లి మండలంలో ప్రజాపాలన పైలట్ గ్రామమైన రాళ్లపేటలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను డీపీవో, మండల ప్రత్యేక అధికారి షరిపోద్దిన్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానాలను పర్యవేక్షించి,లబ్ధిదారులతో పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ, తదితరులు ఉన్నారు.

## నేరెళ్లలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సిరిసిల్ల రూరల్, మే 6: మండలంలోని నేరెళ్లలోని చారిత్రక ఆలయమైన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గాంధీ చౌక్, మే 6: సిరిసిల్ల, వేములవాడ కోర్టులలో జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ సూచించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల వివరాలను పోలీస్ స్టేషన్ల వారిగ తెలుసుకున్నారు. రాజీ మార్గం ద్వార కేసులను పరిష్కారం చేసుకుంటే కక్షిదారులకు కలిగే ప్రయోజనాలపై వివరించాలన్నారు. ఇక్కడ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్‌కుమార్, సృజన, మేఘన, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, లోక్ అదాలత్ మెంబర్స్ చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పెంట శ్రీనివాస్, సందీప్, సతీష్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

## రోడ్డుపై ధాన్యం బస్తాలు..

వేములవాడ రూరల్, మే 6 : మర్రిపల్లి వద్ద కొత్తగా నిర్మించిన బిడ్జీ వద్ద లారీలో నుంచి ధాన్యం బస్తాలు కిందపడ్డాయి. బిడ్జి పనులు పూర్తయినా తారురోడ్డు వేయకపోవడంతో చందుర్తి మండలం మర్రిగడ్డ నుంచి బోయినపల్లి మండలంలోని ఓ రైస్‌మిల్లుకు వస్తున్న లారీ మర్రిపల్లి బిడ్జీ వద్ద రోడ్డు దిగుతుండగా, లారీ నుంచి ధాన్యం బస్తాలు కిందపడ్డాయి. కిందపడే సమయంలో వెనుక వాహనాలు రాకపోవడంతో ప్రమాదం జరగలేదు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



మర్రిపల్లి వద్ద రోడ్డుపై పడిన బస్తాలు

# గంజాయి నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

**ఎస్పీ మహేశ్ బీ గితె**

రాజన్న సిరిసిల్ల, మే 6 (నమస్తే తెలంగాణ): గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎస్పీ మహేశ్ గితె పిలుపునిచ్చారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. గంజాయి రవాణా కేసుల్లో నిందితుడైన ఎండీ అహ్మద్‌ను మంగళవారం ఎల్లమ్మ టెంపుల్ వద్ద పట్టణ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టుకున్న నిందితుడిపై ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయినిపల్లి, చందుర్తి సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 కేసులున్నట్లు తెలిపారు. కొంత కాలంగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు అహ్మద్‌ను చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో గంజాయి రవాణా, సాగుచేసినా, సేవించినా అందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణాపై ఫోన్ నంబర్ 8712656392కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసు సిబ్బంది శ్రీకాంత్, ఇంతియాజ్‌ను ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితె

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గితె సూచించారు. ఒక వేళ సైబర్ నేరం జరిగిన గంటలోపు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొబైల్ నెంబర్‌కు కాల్ చేసి మాయమాటలతో మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు అందుతున్నందున ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విడుదల చసిన ప్రకటనలో ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశ చివరికి ఇబ్బందుల పాలు చేస్తుందని హితవు చెప్పారు. www.cybercrime.gcv.in వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయడం ద్వారా పోగొట్టుకున్న డబ్బులు మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా సంస్థల వెబ్‌సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లు పొందాలన్నారు. పోలీసు, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఆధార్ కార్డు వివరాలు అడిగితే స్పందచవద్దన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు శాఖ ఇచ్చిన సమాచారాన్ని పాటిస్తూ ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రుద్రంగి, మే 6: ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన 22 చెక్కులను నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏఎంసీ చెర్మన్ తిరుపతి, ఎంపీడీవో నటరాజ్, మాజీ జడ్పీటీసీ మీనయ్య పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

# కసాయి తల్లి

- అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని కొడుకుపై దాడి
- చికిత్స పొందుతూ బాలుడి మృతి
- తాతయ్య ఫిర్యాదుతో కేసు నమోదు

సిరిసిల్ల టౌన్, మే 6: నవమాసాలు మోసి, కనీపెంచిన కొడుకునే కడతేర్చిందో తల్లి. తన అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని దాడి చేయడంతో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందగా, సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌లో విషాదం నెలకొన్నది. బాలుడి తాతయ్య లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌కు చెందిన మంగళారపు మాధవి అదే ప్రాంతానికి చెందిన అరుణ్ కొన్నేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కొడుకు ఆరుష్(6)తో పాటు కూతురు ఆదిత్రి(9) ఉన్నారు. అరుణ్ మూడేండ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, మాధవి తన కొడుకు, కూతురుతో కలిసి సిరిసిల్లలోని వెంకంపేటలో వేరుగా నివాసం ఉంటున్నది. భర్త మృతిచెందిన అనంతరం పిల్లలిద్దరినీ అరుణ్ తల్లిదండ్రుల వద్ద ఉంచింది. కొద్ది రోజుల క్రితం మాధవి వచ్చి తన పిల్లలను బలవంతంగా తీసుకుని వెళ్లిపోయింది. పిల్లల్ని తమకు ఇవ్వాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మాధవితో అక్రమ సంబంధం పెట్టుకున్న కిషన్ అనే వ్యక్తి బెదిరించాడంటూ లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి మాధవి ఫోన్ చేసి ఆరుష్ ఆడుకుంటూ కింద పడిపోయాడని, కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించామని చెప్పిందని, దవాఖానకు వెళ్లి చూసేసరికే చనిపోయి ఉన్నాడని లక్ష్మీనారాయణ రోదిస్తూ పేర్కొన్నాడు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారనే కారణంతోనే వారు దాడి చేస్తేనే తన మనుమడు ఆరుష్ మరణించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కనీసం తమ మనుమరాలినైనా తమకు అప్పగించాలని, మాధవి, కిషన్ నుంచి తమకు ప్రాణహాని ఉందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకోం

- అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే దర్శనం కల్పించాలి
- అధికారుల తీరును నిరసిస్తూ 14న వేములవాడ బంద్
- వేములవాడ పట్టణ పురప్రముఖులు
- రాజన్న రక్షణ సమితి ఏర్పాటు



వేములవాడ పట్టణంలోని పద్మశాలి భవనంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, మే 6: అభివృద్ధి పనుల నిమిత్తం వేములవాడ రాజన్న ఆలయాన్ని మూసివేయాలని అధికారులు నిర్ణయించడం సరికాదని వేములవాడ పట్టణ పుర ప్రముఖులు పేర్కొన్నారు. జూన్ 15వ నుంచి మూసివేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన పుర ప్రముఖులు, వ్యాపారులు, స్థానికులు మంగళవారం వేములవాడలోని పద్మశాలి సంఘం భవనంలో సమావేశమయ్యారు. అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 14న వేములవాడ బంద్ చేపట్టామని, అలాగే ఆలయాన్ని మూసివేయకుండా ఉండేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేసేందుకు పురప్రముఖులతో రాజన్న రక్షణ సమితిని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ చారిత్రక ప్రాశస్త్యం ఉన్న అనుబంధ ఆలయాలను తొలగిస్తే ఊరుకొనేది లేదని, ఎంతో మహిమగల ఈ ఆలయాలను ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోవద్దన్నారు. రాజన్న ఆలయం ఆగమశాస్త్రం ప్రకారం లేదని అధికారులు చెబుతున్నారని, మరి ఆలయ ఆవరణలో దర్గా ఉండవచ్చా అని ప్రశ్నించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే స్వామివారికి నిత్య పూజలతో పాటు భక్తులకు దర్శన అనుమతి ఉండాలని డిమాండ్ చేశారు. రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి మాత్రమే భక్తులు వేములవాడకు వస్తారని, మరో ఆలయంలో దర్శనం ఏర్పాటు చేస్తే ఎవరూ రారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశిస్తూ ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నాడని, ఇట్లాంటి పరిస్థితుల్లో అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేయడం సరైనది కాదన్నారు. అధికార పార్టీ నాయకులు చెబుతున్నట్లుగా ఆలయ అభివృద్ధికి రూ.75 కోట్లు ఇప్పటివరకూ విడుదల కాలేదన్నారు. వేములవాడ రాజన్న రక్షణ సమితి చేసే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, పట్టణంలోని పలు కుల సంఘాల నాయకులు, చిరువ్యాపారులు ఉన్నారు.

## విద్యార్థులకు సన్మానం

వేములవాడ రూరల్, మే 6 : మండలంలోని హన్మాజీపేటలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదోతరగతి ఫలితాల్లో 500పైన మార్కులను సాధించిన 9 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ప్రఫుల్, వశిష్ట, శ్రీనిధి మండలంలోని అత్యధిక మార్కులు సాధించారన్నారు. అనంతరం వారిని పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జింకె విజయశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంకె మధు, నాయకులు పసుల అంజి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ జంకె మల్లేశం, తీగల శ్రీనివాస్‌గౌడ్, జంకె పర్శరాం, సందేల నరేశ్, మెరుపుల కార్తీక్, ప్రభాకర్, మల్లికార్జున్, నవీన్ ఉన్నారు.

**నూకలమర్రిలో..**

నూకలమర్రి గ్రామంలోని పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు గ్రీష్మ, రాజువర్ధన్, శ్రీనిధి, శరణ్య, రామ్‌చరణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యాక్షుడు వకుళభరణం శ్రీనివాస్, రోమాల ప్రవీణ్, పాలకుర్తి పరశురాం, ప్రధానోపాధ్యాయులు బూర సదానందం, సుదీర్, ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్

కలెక్టరేట్, మే 6 : సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఎస్సెస్సీ పరీక్షల్లో 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 500పైగా మార్కులు సాధించిన 5 గురు విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పదిలో అత్యధిక మార్కులు సాధించిన గుండ్లపెల్లి వరుణ్ (548), చిప్ప మేఘన(545), కైరంకొండ శ్వేత(521), సిరిమల్ల అక్షయ శ్రీ(514), యెన్నం అమృత్ సాగర్(512) విద్యార్థులను కలెక్టర్ అభినందనించారు. ఈ ఫలితాలకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు పోలాస మల్లేశం, ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గూడూరు రవికుమార్, పర్కాల రవిందర్, జంగిటి భానుచందర్ పాల్గొన్నారు.

## 'భూ భారతి' సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, మే 6 : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి' రెవెన్యూ చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులో భాగంగా రుద్రంగి, మానాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మంగళవారం కలెక్టర్ పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మండలాల్లో నూతన చట్టంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. భూ భారతి పోర్టల్ పైలెట్ ప్రాజెక్టుగా రుద్రంగి మండలం ఎంపిక చేసి, రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మానాలలోని కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో డీఆర్డీవో శేషాద్రితో కలిసి పరిశీలించి, ధాన్యం విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. కొనుగోల్లు వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జిలు భూపతి, షరీఫ్, డీటీ మనోహర్, ఆర్ఐ శ్యామ్ నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- హరితహారం చెట్లు నరికిన దుండగలు
- పట్టించుకోని అధికారులు



నరికిన హరితహారం చెట్లు

కోనరావుపేట, మే 6: పల్లెల్లో పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. గత ప్రభుత్వం 'హరితహారం'లో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ప్రస్తుతం వాటిని పట్టించుకోనే నాథుడే కరువయ్యారు. దీంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న వందలాది మొక్కలను దుండగలు నరికేస్తున్నారు. ఇదంతా చూస్తున్న అధికారులు వారిపై చర్యలు తీసుకునేందుకు చోధ్యం చేస్తున్నారు. వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో గత ప్రభుత్వం బస్టాండ్ ఆవరణ నుంచి గ్రామం వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా పెద్దఎత్తున మొక్కలు నాటింది. అప్పటి సర్పంచ్ గోపు పరశురాములు వాటిని సంరక్షించడంతో భారీ వృక్షాలుగా ఎదిగాయి. ఈ క్రమంలో ఎంతో ఆహ్లాదకరంగా గ్రామానికి స్వాగత తోరణంగా ఉన్న చెట్లను గుర్తు తెలియని దుండగులు నరికేస్తున్నారు. దీంతో ఎండ్ల నుంచి పచ్చగా ఎదిగిన చెట్లు గొడ్డలి వేటుకు ఒక్కసారిగా బలయ్యాయి. ఈ క్రమంలో చెట్లన్నీ మొడువారిపోయి కళావిహీనంగా మారాయి. గ్రామంలో పాలకులు లేపోవడంతో సంబంధిత అధికారులు మాకెందుకులే అంటూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రకృతి పాడుచేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడానికి కూడా ముందుకు రావడంలేదనని ప్రకృతి ప్రేమికులతో పాటు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తిరిగి మొక్కలు నాటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్

## వేములవాడ ప్రధాన రోడ్డు విస్తరణ పూర్తి చేస్తాం

- గజానికి రూ. 30 వేల పరిహారం ఇస్తాం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- వేములవాడలో ఇండ్ల సర్వే పరిశీలన
- అధికారుల తీరుకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన

వేములవాడ, మే 6: వేములవాడ పట్టణంలోని మూలవాగు నుంచి రాజన్న ఆలయం దాకా రహదారి విస్తరణను కచ్చితంగా పూర్తిచేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నాలుగు ఇంజినీరింగ్ బృందాలు అంచనా వేసేందుకు రాగా, ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. వేములవాడ పట్టణంలో 50 ఏళ్లుగా రోడ్ల విస్తరణకు ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. ఈసారి కచ్చితంగా 80అడుగుల మేర విస్తరణ పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నష్టపరిహారం కింద ఇప్పటికే రూ.47.80కోట్లు కలెక్టర్ ఖాతాలో జమయ్యాయని చెప్పారు. గజానికి రూ.30వేల పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. 315 ఇండ్లలో భాగంగా ఇప్పటివరకు 257 ఇండ్ల సంబంధించిన సర్వే పూర్తయిందని తెలిపారు. ఇక్కడ ఆయన వెంట వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, పట్టణ సీఐ వీరప్రసాద్ ఉన్నారు.

**వ్యాపారుల నిరసన..**

రోడ్డు విస్తరణపై ఇప్పటికే తాము రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించామని, న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని వ్యాపారులు తెలిపారు. ఈ విషయాన్ని అధికారులకు వివరించినా పట్టించుకోవడంలేదని, మళ్లీ సర్వేకు వచ్చారని మండిపడ్డారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా మంగళవారం ఆలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్నోఏండ్లుగా తాము వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఏ వ్యక్తి కూడా జీవనోపాధి కోల్పోవడం లేదని, ఒక్కరు కూడా నిర్వాసితులు కావడం లేదని, ఇట్టి భూసేకరణ కింద పునరావాసం, ఉపాధి కల్పన వర్తించదని పేర్కొనడం నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దుకాణాలు పూర్తిగా పోతుండడమే కాకుండా బతుకులు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సరైన న్యాయం చేసే వరకు నిరసన చేపడుతామని వ్యాపారులు తెలిపారు.

## రైతులు ఆందోళన చెందొద్దు

వేములవాడ రూరల్, మే 6 : తడిసి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా సహకార అధికారి రామకృష్ణ సూచించారు. మంగళవారం వేములవాడ ప్రాథమిక సహకార సంఘంలో ఆయన మాట్లాడుతూ, సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం కేంద్రంలో ధాన్యం తడిస్తే కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో వేములవాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించామన్నారు. సోషల్‌మీడియా వేదికగా వచ్చే వందతులను ఎవరూ నమ్మవద్దన్నారు. ఆయన వెంట సీఈవో లక్ష్మణ్ ఉన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

వేములవాడ, మే 6 : పట్టణంలోని మార్కండేయనగర్ వీధిలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. తాటికొండ సంతోష్ ఫిజియోథెరపిస్ట్ కుటుంబ సభ్యులతో సహా ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, క్లూస్ టీం చేరుకొని వేలిముద్రను సేకరిం చడంతో పాటు చోరీ చేసిన తీరును పరిశీలించారు. అయితే ఇంట్లో ఉన్న దాదాపు 20 వేలకుపైగా నగదు, 10 గ్రాముల బంగారం వస్తువులు చోరీ అయ్యాయని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిడుగు పాటుకు కాడెద్దు మృతి

ఇల్లంతకుంట, మే 6 : మండలంలోని సోమవారం రాత్రి కురిసిన రాళ్ల వర్షానికి తాళ్లపెల్లి, పత్తికుంటపల్లి గ్రామాల్లో ధాన్యం నెలరాలయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో వరి కోత పట్టే దశలో ఉండగా, వడగళ్ల వర్షం రావడంతో 50 శాతం వడ్లు నెలరాలడంతో రైతులు కంటతడి పెట్టారు. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన కోమల పరశురాం రైతు గత నెలలో రూ . లక్షా 20 వేల విలువ గల కాడెద్దులను అప్పు చేసి కొనుగోలు చేశాడు, సోమవారం రాత్రి పిడిగు పాటుకు ఒక ఎద్దు మృతి చెందగా, మరో ఎద్దు బతికి ఉన్నా నడవలేని పరిస్థితుల్లో ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## విద్యార్థులకు అవగాహన

ముస్తాబాద్, మే 6 : విద్యార్థులకు వేసవి సెలవుల్లో చదువులతో పాటు వివిధ కళలపై అవగాహన కల్పించేందుకు మండల విద్యా అధికారి రాజిరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో రోజుకో కళపై అవగాహన కార్యక్రమం నిర్వహస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సిద్దిపేటకు చెందిన మురళీధర్ (ఎస్ఏ సోషల్ )పిల్లలకీ భారతీయ కళలు-నృత్యంపై అవగాహన కల్పించారు. అనంతరం జానపద గీతాలకు స్టెప్పులు నేర్పించారు. విద్యార్థులు, ఈ సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలని మండల విద్యాధికారి తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోండి

ముస్తాబాద్, మే 6 : మండలం నామాపూర్ గ్రామానికి చెందిన అలకుంట కవిత ఇల్లు సోమవారం అకాల వర్షానికి, ఈదురుగాలులకు ఇంటిపైకప్పు కూలింది. కవిత భర్త రాజు పదేళ్ల క్రితం మృతి చెందాడు. వారికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అప్పటి నుంచి కూలీ పని చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. కాగా, వర్షానికి ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోవడంతో నీడ లేకుండా పోయిందని, అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని వేడుకుంది. కవిత కుటుంబ పరిస్థితిపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తూ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అధికారులను కోరారు. బీఆర్ఎస్ నాయకులు అనిల్ పవన్ ఉన్నారు.